క్లుప్తంగా

రిమ్స్ అన్నపూర్ణకు రూ.50 వేలు విరాళం



విరాళం అందిస్తున్న పంచిరెడ్డి వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్ : రిమ్స్ అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకానికి ఏనుగుమహల్ వీధికి చెందిన డాక్టర్ పంచిరెడ్డి వేంకటేశ్వరరావు తన తల్లిదండ్రులు, పూర్వీకుల జ్ఞాపకార్థం రూ.50 వేలు సోమవారం అందించారు. ఈ విరాళాన్ని సంఘం కార్యదర్శి ఫల్గుణరావు, జిల్లా సేవాదళ్ కో–ఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావుకు అందించారని జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. దాతలను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ సంఘం అధ్యక్షుడు గంగుల రమణబాబు అభినందించారు. కార్యక్రమంలో పంచిరెడ్డి అనిల్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వంతెన పనుల పరిశీలన



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి కూడలి వద్ద చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ వెంతన పూర్తయితే జి.సిగడాం, పొందూరు మండలాల్లోని సుమారుగా 30 గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కలగనుంది. ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి డాక్టర్ విశ్వక్సేన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనపై దృష్టి సారించాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ అత్యంత కీలకమని.. నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దానిని సాధించే దిశగా విద్యార్థులు నిరంతరం కృషిచేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి, పేదరికం రూపుమారుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ/కళాశాల ప్రిన్సిపల్ ప్రగడ దుర్గారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతి వెంకటేశ్వరరావు, డి.ఫల్గుణరావు, పవన్, జగదీష్, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్



నోటిఫికేషన్ అంటిస్తున్న ఎంఈఓ అరసాడ రవి

జి.సిగడాం: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ గురువారం వైడుదలైంది. పెంట ఎంపీయూపీ పాఠశాలలో ఎంఈఓ అరసాడ రవి, హెచ్ఎం మజ్జి మదన్‌మోహన్ సమక్షంలో నోటీస్ బోర్డులో ఎన్నికల షెడ్యూల్‌ను అంటించారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 7 నుంచి 1 గంటల సమయంలోగా ఎన్నిక నిర్వహించాలన్నారు.

సేవలు సంతృప్తినిచ్చాయి



మల్లేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తన విధి నిర్వహణ ఎంతో సంతృప్తినిచ్చిందని బుధవారం ఉద్యోగ విరమణ చేసిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక పీపీ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. నగరంలోని ఓ హోటల్లో గురువారం టెన్యూర్ పీపీలు, కేడర్ పీపీలు మల్లేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టుల పోలీస్ లైజన్ ఆఫీసర్లు, హోంగార్డులు, కార్యాలయ సిబ్బంది, మాజీ పీపీలు, పీపీలు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ సభ్యులు బోను మన్మథరావు, జిల్లా ఇన్‌చార్జ్ దాసరి తిరుమలరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెనుకబాటు ప్రాతిపదికన ఎస్సీలను నాలుగు వర్గాలుగా విభజించడం ఆనందదాయకమన్నారు.

● రుచి, శుచి తప్పనిసరి



కొత్తపెంట ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ అరసాడ రవి గురువారం తనిఖీ చేశారు. మెనూను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రుచి, శుభ్రత పాటించాలన్నారు. హెచ్ఎం మజ్జి మదన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు. -జి.సిగడాం

● గురు దత్తాత్రేయునికి అభిషేకం



బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో గురు దత్తాత్రేయ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. - శ్రీకాకుళం కల్చరల్

● సొంత ఖర్చులతో పూడికతీత పనులు



రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం పంచాయతీ వెంకటేశ్వర దిగువ కాలనీలో గల మురుగు కాలువల్లో గత కొన్ని నెలలుగా పూడికతీత పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపైకి మురుగు నీరు వచ్చి అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఈ సమస్య పరిష్కారం కాలేదు. కాలనీకి చెందిన రౌతు అప్పలనాయుడు, పిన్నింటి వెంకటస్వామి, జోగ ఆది తదితరులు స్పందించి సొంత డబ్బులతో జేసీబీని పెట్టి వీధి కాలువల్లో గురువారం పూడిక తీయించారు. కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. -రణస్థలం

ఈ నగరానికి ఏమైనది?

- నగరంలో మురుగునీరంతా నాగావళి నదిలోకే..
- ఇష్టారాజ్యంగా హోటల్స్, చికెన్‌షాపులు, హాస్పిటల్స్ వ్యర్థాలు పారబోత
- మురుగునీటి శుద్ధజలం ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో?

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగర పరిధిలోని నాగావళి నదిలో రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతోంది. నగరవాసులందరికీ తాగునీటిని అందించే నాగావళి నదిలోకి మురుగుకాలువ నీరు, హోటల్స్ వ్యర్థాలు, ఆస్పత్రి వ్యర్థాల్ని ఇష్టారాజ్యంగా కలిపేస్తుండటంతో నీరు కలుషితమవుతోంది. ఈ ప్రభావం నదీతీర ప్రాంతాలైన బలగ, శాంతినగర్‌కాలనీ, ఫాజుల్‌బాగ్‌పేట, హయాతినగర్, వైష్ణవుపీధి, తురాయిచెట్టువీధి, పెద్దరెల్లివీధి, గుడివీధి, బాదుర్లపేట, గోల్కొండవారివీధి తదితర కాలనీల ప్రజలపై పడుతోంది.

ప్రతిపాదనలకే పరిమితం..

వాంబేకాలనీ సమీపంలో పొన్నాడ వంతెనకు ఎదురుగా మురుగునీటిని శుద్ధజలంగా చేసేందుకు అమృత్ 2.0 కింద తొలివిడతలో 10 ఎంఎల్‌డీ నీటిని శుభ్రం చేసేందుకు రూ.30 కోట్లతో ప్రజారోగ్యశాఖ పనులు చేపట్టింది. తర్వాత అర్ధంతరంగా పనులు నిలిపేశారు. ఇటీవల డేఅండ్‌నైట్ కొత్తవంతెన వద్ద 5 ఎంఎల్‌డీ నీటిని శుభ్రం చేసేందుకు పూర్తిస్థాయి అంచనాలు తయారుచేసి టెండర్లకు ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. శుద్ధజలం తయారికి పనులు ఆరంభదశలో నిలిచిపోవడంతో జరిగిన పనులు పూర్తిగా పాడైపోయాయి. మిర్తిబట్టి పనులకు సైతం రీటెండర్లు పిలిచి రూ.40కోట్లు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించినట్లు అధికారులు చెబుతున్నారు.



నిర్మాణ దశలో ఉన్న వాంబేకాలనీ వద్ద మురుగునీరు శుద్ధజలం ప్రాజెక్టు

నీరు కలుషితం..



జిల్లా పరిషత్ ప్రాంతంలో చాలా కాలనీల ప్రజలు నాగావళి నదిలోనే స్నానాలు చేస్తుంటారు. మురుగునీరు చేరి నది కలుషితమవ్వడంతో చర్మవ్యాధులు వస్తున్నాయి. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. నీరు కలుషితం కాకుండా అధికారులు చొరవతీసుకోవాలి.

– తట్ట అప్పలరాజు, మాపూరివారివీధి, శ్రీకాకుళం

చర్యలు చేపడతాం..



నాగావళి నదిలో మురుగునీరు నేరుగా కలవకుండా చర్యలు చేపడతాం. మురుగునీరు శుద్ధి చేసేందుకు ఇప్పటికే రెండుచోట్ల అమృత్ పథకం కింద రూ.30 కోట్లతో పనులు చేపట్టాం. అనివార్య కారణాల వల్ల పనులు నిలిచిపోయాయి. కొత్త వంతెన వద్ద మరో 5 ఎంఎల్‌డీ నీటిని శుభ్రం చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులు పూర్తిచేస్తాం.

– చల్ల ఓబులేసు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్



పొన్నాడ వంతెన వద్ద నదిలోకి వెళ్తున్న మురుగనీరు



పాతవంతెన పార్కు వద్ద నాగావళి నదిలో మురుగునీరు(ఫైల్)

ఆలిండియా ఎస్‌బీఐ స్టాఫ్ ఫెడరేషన్
జనరల్ సెక్రటరీగా చంద్రశేఖర్

శ్రీకాకుళం అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్ ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ స్టాఫ్ ఫెడరేషన్, నేషనల్ కాన్ఫిడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయంలో గురువారం అమరావతి సర్కిల్ శ్రీకాకుళం జిల్లా రీజియన్ సెక్రటరీ కేసీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఉద్యోగులు సంబరాలు జరుపుకొన్నారు. గత నెల 28న చండీగఢ్‌లో జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అమరావతి సర్కిల్ ఏర్పడిన అనతి కాలంలోనే ఈ పదవి రావడం అమరావతి సర్కిల్‌కి, తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ శ్రీకాకుళం రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసీబ్ అమీర్, స్టేట్ బ్యాంక్ ఆఫీసర్ అసోసియేషన్ రీజనల్ సెక్రెటరీ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది

పరామర్శ..

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి రామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ గురువారం సంచాం గ్రామానికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు కలిశెట్టి కన్నంనాయుడు, రెడ్డి దాలినాయుడు, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.



రామకృష్ణను పరామర్శిస్తున్న సాయికుమార్

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం సందర్శించారు. క్లాస్‌వర్క్, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి విద్యార్థినులు పలు సమస్యలను తీసుకువచ్చారు. తాగునీటి సమస్య, రన్నింగ్ నీటి సౌకర్యం, సరిపడా మరుగుదొడ్లు లేకపోవటం వంటి సమస్యలు వివరించారు. పాఠశాల ఆవరణం పిచ్చి మొక్కలతో నిండి ఉండటంతో పాములు తరచూ కనిపిస్తున్నాయని, పిచ్చి మొక్కలు తొలగించాలని కోరారు. అనంతరం ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి



తల్లిపాల ఆవశ్యకతను సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి అన్నారు. నగరంలోని 41, 42 డివిజన్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో తల్లిపాలు ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు గుమ్మా రఘురామ్, సీహెచ్ మణి, గుజరాతీపేట సెక్టార్ సూపర్‌వైజర్ పి.ఉమ, ఏడబ్ల్యూడబ్ల్యూ ఎస్‌బీ లక్ష్మి, ఎం.శ్రీలక్ష్మి, ఝాన్సీ, పద్మావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: తల్లి పాలు బిడ్డలకు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణాపార్క్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మి అన్నారు. సెక్టార్ పరిధిలోని గొంటివీధి, రెడ్డికి వీధి, కత్తిరివీధి, బాకర్‌సాహిబ్‌పేట అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ ఎస్.వి.రమణ, ఆశావర్కర్ శశికళ, అంగన్‌వాడీ కార్యకర్తలు నలినీకుమారి, హైమ, చిరంజీవి, దీప, లక్ష్మి, మంగవేణి, రూబియాబేగం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం: మండలంలోని బాతువ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఏఈఈ తిరుపతిరావు గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మరమ్మతులు చేస్తామన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో వున్నాం, ఉల్లివలప, డీఆర్‌వలస, ముషినివలస, రౌతుపేటతోపాటు మరో ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

షిరిడీసాయికి విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొందిలీపురం సాయిదర్బార్‌లో షిరిడీ సాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామికి హారతి ఇచ్చి విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

చిన్నారులపై అత్యాచారాలు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పలాస జూనియర్ కళాశాల విద్యార్థులు

కాశీబుగ్గ: రాష్ట్రంలో రెండు వారాలుగా చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోవడం సిగ్గుచేటని, వీటిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి డిమాండ్ చేశారు. చిన్నారులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ పలాస నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పలాస జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పలాస కాంప్లెక్స్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. మహిళా హోంమంత్రిగా ఉండి కూడా మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. దిశా, నిర్భయ, పోక్సో చట్టాల్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పవన్, గుణశేఖర్, సూర్య, విజయ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న కనకరాజు

శ్రీకాకుళం అర్బన్: పోటీ పరీక్షల నిమిత్తం చదువుకునేందుకు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చిన ఏ ఒక్క నిరుద్యోగ అభ్యర్థి కూడా పుస్తకాలు లేవని ఇబ్బందులు పడకూడదని వ్యవసాయ శాస్త్రవేత్త, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఆరికతోట కనకరాజు, ఉమా దంపతులు అన్నారు.

గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం సమగ్ర పుస్తకాలు లేవని ఇటీవల పలు వార్తాపత్రికల్లో ప్రచురించిన కథనాలకు స్పందించి రూ.15000 విలువైన గ్రూప్–1,2, టెట్, డీఎస్సీ, బ్యాంక్స్ తదితర బుక్స్ కొనుగోలు చేసి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, పాఠకులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించరూ..

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అకడమిక్ భవనాల చుట్టుపక్కల మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ మొక్కలు వల్ల భవనాలు గోడలకు నష్టం వాటిల్లుతుంది. ఈ మొక్కల్లో పాములు చేరుతున్నాయి. మొక్కలు తొలగించాలని అధికారులు దృష్టికి అధ్యాపకులు, విద్యార్థులు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ఇంజినీరింగ్ బ్లాక్‌కు అనుకొని ఉన్న మొక్కలు

కళాకారుడి మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పెద్దపాడు గ్రామానికి చెందిన సీనియర్ పౌరాణిక కళాకారుడు అరసవల్లి వీరస్వామి(90) మృతికి రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు సంతాపం ప్రకటించారు. ప్రముఖ కళాకారుడు కలగ లక్ష్మయ్య వద్ద నక్షత్రక, అర్జునుడు, లక్ష్మణుడు, బిల్వ మంగళుడు, బృహస్పతి వంటి పాత్రలలో ప్రదర్శన ఇచ్చారు. అనేక బహుమతులు, సత్కారాలు పొందారు. వీర స్వామి మృతి పట్ల సమాఖ్య సభ్యులు కలగ గణేష్, కలగ ఆదికేశవ్, పన్నాల నర్సింహమూర్తి, చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, రామచంద్రదేవ్, రమణారావు, అప్పారావు సంతాపం ప్రకటించారు.

బాలల రక్షణ అందరి బాధ్యత

కాశీబుగ్గ: బాలలు అక్రమ రవాణాకు గురికాకుండా అందరూ తమవంతు కృషి చేయాలని పలాస గవర్నమెంట్ రైల్వే పోలీసుస్టేషన్ సిబ్బంది కోరారు. బాలల రక్షణ, గంజాయి అక్రమ రవాణా తదితర అంశాలపై పలాస రైల్వేస్టేషన్‌లో గురువారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎం.సోమేశ్వరరావు, ఆర్పీఎఫ్ సిబ్బంది ఎస్.జీవరత్న, డబ్ల్యూపీసీ జె. అనిత, ఆర్పీఎఫ్ చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు

సోంపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సోంపేట సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. సోంపేటలోని సంస్కారభారతి జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మడ్డు సర్వేశ్వరరావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ద్విచక్రవాహనం చోరీ

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పట్టణానికి చెందిన అవుగాన మిన్నారావు తన ద్విచక్ర వాహనాన్ని కాంప్లెక్స్ ఆవరణలో పార్కింగ్ చేసి సొంత పని నిమిత్తం బస్సుపై ఇతర ప్రాంతానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి బండి కనిపించకపోవడంతో చోరీకు గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

రేపు ఉచిత వైద్య శిబిరాలు

కాశీబుగ్గ: పలాస మండలం లొత్తూరు, పెంటిభద్ర గిరిజన గ్రామాల్లో ఈ నెల 3న ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పలాస మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చైర్‌పర్సన్, పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు.